క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



వెంకయ్యనాయుడును కలిసిన చవటపాళెం గ్రామస్తులు

వెంకటాచలం: నాలుగు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును చవటపాళెం గ్రామస్తులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి పనుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

నేడు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగనున్న శిబిరాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారు. ప్రముఖ వైద్య నిపుణులు రోగులను పరీక్షించి వైద్య సేవలందించనున్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పొదలకూరు : ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐఓ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. పట్టణంలోని కాకతీయ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ ఆయా కేంద్రాలకు విచ్చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల్సిందిగా ఆదేశించారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం



సామూహిక వ్రతం చేస్తున్న మహిళలు

మనుబోలు : మనుబోలులోని శ్రీదేవి భూదేవి సమేత విష్ణాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు, వెంకటసాయి, పవన్‌కుమార్ శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మహిళలతో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పెనుగొండ సుధాకర్, శాంత దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు పొదలకూరులో మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని మనుబోలు రోడ్డులో ఉన్న ఈద్గా ప్రహరీని ప్రారంభిస్తారని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ బుధవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కేసీఎస్ కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి పేర్కొన్నారు.

గోశాల నిర్మాణానికి నగదు వితరణ



నగదు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో గోశాల నిర్మాణానికి కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన పాపిరెడ్డి దంపతులు రూ.3,50,000 నగదును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

ట్రస్ట్ భవనానికి శంకుస్థాపన




మనుబోలు : శ్రీసేవానాథం ట్రస్ట్ కార్యాలయం కోసం నూతన భవన నిర్మాణానికి మనుబోలు మండల కేంద్రంలో ట్రస్ట్ అధ్యక్షుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనంలో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, అలాగే కార్యాలయ ఆవరణలో వ్యాయామశాల, బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం రామలింగేశ్వరుడు

• శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

పొదలకూరు : వందల ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని కామాక్షితాయి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం భక్తుల కొంగుబంగారంగా వెలసిల్లుతోంది. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు నియమ నిష్టలతో దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పొదలకూరు శివాలయానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుంటారు. శివరాత్రి నాడు రాత్రి ఇసుక వేస్తే రాలనంత జనం దేవస్థానానికి చేరుకుంటారు. ఇదే ప్రాంగణంలో పార్వతీ, పరమేశ్వరుల పుత్రుడైన గణనాథుడు పొదలకూరులోని శైవక్షేత్రంలో



వినాయకుని విగ్రహం



పట్టణంలోని కామాక్షితాయి సమేత రామలింగేశ్వరాలయం

విశేష పూజలందుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఉన్న విఘ్నేశ్వరాలయాన్ని కూడా ముస్తాబు చేస్తారు. గణపయ్యను దర్శించుకుని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామికి భక్తులు పూజలు చేస్తారు. మహాశివరాత్రి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని చోళరాజులు ఏలుతున్న కాలంలో వినాయకుని గుడిని నిర్మించారు. ఇది సుమారు ఎనిమిది అడుగుల ఎత్తు ఉంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

దేవస్థానం పాలకమండలి సమయం ముగియడంతో దేవదాయ శాఖ అధికారులు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈనెల 7వ తేదీ సాయంత్రం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణం, రావణ సేవ, 8న రాత్రి నందిసేవ(మహాశివరాత్రి) 12 గంటలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9న సాయంత్రం గిన్నెభిక్ష, 10న ఉదయం కల్యాణం, సాయంత్రం గజవాహన సేవ, పారువేట, 11న రాత్రి అలకలతోపు, 12న ఉదయం ధ్వజావరోహణం, రాత్రి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి, ఈఓ పెంచలప్రసాద్ వెల్లడించారు.

కామాక్షితాయి ఆలయంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ ఎం.శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మూడు రోజుల పాటు..



కృష్ణపట్నంలోని చారిత్రక సిద్ధేశ్వరాలయం

పొదలకూరు (ముత్తుకూరు) : మహాశివరాత్రి పండగ వేడుకల నిర్వహణకు మండలంలోని ముక్కంటి ఆలయాల్లో సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా కృష్ణపట్నం గ్రామంలోని చారిత్రక సిద్ధేశ్వరాలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే, బ్రహ్మదేవిలోని కైలాసనాథేశ్వరాలయం, వల్లూరు, పిడతాపోలూరు, ముత్తుకూరు, పోలంరాజుగుంట గ్రామాల్లోని శ్రీకైలాస నాగేశ్వరాలయాలను విద్యుద్దీపకాంతుల నడుమ శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. పైనాపురంలోని భోగేశ్వరాలయం, ఈపూరులోని ఆలయాన్ని పండగకు సిద్ధం చేస్తున్నారు.



శివాలయానికి విచ్చేసిన భక్తులు(ఫైల్)

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి



ఇందుకూరుపేట: వైద్యసేవలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు



మనుబోలు : రోగుల కేస్‌షీట్‌లను పరిశీలిస్తున్న డాక్టర్ గేయపూజిత

ఇందుకూరుపేట : పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి అన్నారు. జగదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇందుకూరుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలహరి, వైద్యాధికారులు కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, స్థానిక సర్పంచ్ ఈదూరు పద్మమ్మ, ఈఓపీఆర్డీ వసుంధర, వైద్యారోగ్య సిబ్బంది మౌనిక, సుధాకర్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకూ కార్పొరేట్ వైద్యం

మనుబోలు : జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణ ప్రాంతాలకూ కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయపూజిత అన్నారు. మండలంలోని గురివిందపూడి గ్రామంలో ఆరోగ్య సురక్ష-2లో భాగంగా బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 334 మందిని పరీక్షించినట్లు తెలిపారు. వైద్యులు మధు, ప్రసాద్ రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత మన్నెమాల సుధీర్‌రెడ్డి, కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఇందుకూరుపేట : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని, ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో బూత్‌లెవల్ అవైర్‌నెస్ గ్రూపుల(బ్యాగ్స్) సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పోలింగ్ పరిధిలో బీఎల్వోలు అవగాహన కార్యక్రమాన్ని విధిగా చేపట్టాలన్నారు. నూతన ఓటర్లను గుర్తించి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ శాతం పెంచేలా బీఎల్వోలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో డీటీ బషీర్, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

యూపీస్కూల్‌ను అభివృద్ధి చేస్తాం

పొదలకూరు (ముత్తుకూరు) : మండలంలోని పంటపాళెంలో ఉన్న యూపీస్కూల్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని జెమినీ ఎడిబుల్స్ ఎండీ ప్రదీప్‌చౌదరి అన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆయన డైరెక్టర్ ప్రతాప్, హెచ్‌ఆర్ బాలసుబ్రహ్మణ్యంలతో కలిసి యూపీస్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు వారికి ఘన స్వాగతం పలికారు. యూపీస్కూల్‌కు అవసరమైన సౌకర్యాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వారు ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు.



స్కూల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి



ఉత్సవ కమిటీ సభ్యులకు చలపతిరావు సన్మానం

• డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు : ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల విజయవంతానికి ఉత్సవ కమిటీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు సమైక్యంగా కృషి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలోని గండవరం ఉదయకళేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సభ్యులను ఆయన సన్మానించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ అంతరాయం తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ఇందు కోసం పోలీసు, విద్యుత్ శాఖ, పంచాయతీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్, సీఐ ఎంవీ సుబ్బారావు, ఎస్సై కె.వీరప్రతాప్, ఏఈ ఎం.రాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు ఎ.మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, సర్పంచ్ ఎన్.సునీల్ కుమార్, ఆలయ ఈఓ బి.శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2.85 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

• నేడు మంత్రి కాకాణిచే ప్రారంభం



కొత్తగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

మనుబోలు : లో-ఓల్టేజీ సమస్యను నివారించేందుకు మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో రూ.2.85 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. దీనిని గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. దీని వల్ల కొమ్మలపూడి, ముద్దుమూడి, చెరుకుమూడి గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయవచ్చని తెలిపారు. దీంతో మూడు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సెంబ్‌కార్ప్‌లో అసిస్టెంట్ కలెక్టర్



కంపెనీ ప్రతినిధులతో అసిస్టెంట్ కలెక్టర్

తోటపల్లిగూడూరు : ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్(సెంబ్‌కార్ప్)ను అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సింహ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గురించి ఆమె తెలుసుకున్నారు. ప్లాంట్ నిర్వహణ, పర్యావరణ అనుకూల విధానాలు, భద్రతా ప్రమాణాల గురించి ప్లాంట్ ప్రతినిధులు ఆమెకు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ఆపరేషన్ హెడ్ ప్రవీణ్‌కుమార్, రిలయబిలిటీ హెడ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ చేయూత

కోవూరు : ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ ద్వారా కొడవలూరు మండలం కమ్మపాళేనికి చెందిన సురేష్‌కు రూ.35 వేలు విలువచేసే బ్యాటరీ ట్రైసైకిల్‌ను నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో బుధవారం రాత్రి అందజేశారు. అలాగే తండ్రిని కోల్పోయిన ముగ్గురు చిన్నారులకు రూ.20 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన బాండ్లను అందజేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



విద్యార్థులకు హాల్ టికెట్‌ల అందజేత

కొడవలూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ, వార్షికోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రవీంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, హేమలత, పుష్పాంజలి, కవిత, ఖాదర్‌బాషా, సత్యానంద్, సుబ్బారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ మైనార్టీ నేతల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న

• బుచ్చిలో టీడీపీకి గట్టి షాక్

కోవూరు : తెలుగుదేశం పార్టీ కోవూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్.షబ్బీర్ తన అనుచరులతో కలిసి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రసన్న నివాసంలో బుధవారం ఈ మేరకు ఆయనతో పాటు తొమ్మిదో వార్డు కౌన్సిలర్ శివకుమార్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు షేక్.దస్తగిరి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వైభవంగా మందిర వార్షికోత్సవం

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిర 18వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూజలు, అభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించారు.

మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవాసమితి సొసైటి అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, దామోదరరావు, ఉపకార్యదర్శి తరుగు ప్రభాకర్, సభ్యులు కె.కోటేశ్వరరావు, సుబ్బానాయుడు, లక్కాకుల ఆనందరావు, రమేష్, పెంచల ప్రసాద్, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వేడుకగా గ్రామోత్సవం

శిరిడీ సాయి సేవాసమితి పర్యవేక్షణలో గ్రామోత్సవం వేడుకగా జరిగింది. బాణసంచా, తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామోత్సవంలో బాబా భక్తులు సంకీర్తనలను ఆలపించారు.

మంప్స్ వ్యాధిపై ఇంటింటి సర్వే

పొదలకూరు : మంప్స్(గవద బిళ్లలు) వ్యాధిపై వైద్యారోగ్య శాఖ సిబ్బంది పొదలకూరు కో-లొకేటెడ్ పీహెచ్‌సీ పరిధి ఎమ్మార్వో కాలనీ సబ్‌సెంటర్ ప్రాంతంలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రిషితకిరణ్ ఆదేశాల మేరకు ఇళ్లకు వెళ్లి సూచనలు, సలహాలు ఇచ్చి వ్యాధిగ్రస్తులు ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్య సహాయకులు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు మాట్లాడుతూ గవద బిళ్లల వ్యాధి వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి సోకిన వారు తుమ్మినా, దగ్గినా, శ్వాశకోస బిందువులు విడుదల చేసినా పక్కవారికి సోకుతుందన్నారు. అధిక తలనొప్పి, ఫ్లూజ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఇవి ఉన్న వారు వెంటనే దగ్గరలోని ఆశా కార్యకర్తకు సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు.



అంగన్‌వాడీ కేంద్రం వద్ద సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే, నేతలు

కొడవలూరు/కోవూరు : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డిని కోవూరు నియోజకవర్గ నేతలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ నేతలు నార్తురాజుపాళెం జాతీయ రహదారి ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు బుధవారం ఉదయం 7 గంటలకే పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో విజయసాయిరెడ్డి అక్కడికి చేరుకోగా నియోజకవర్గంలోని నేతలు మండలాల వారీగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అక్కడి నుంచి కారులో బయలుదేరగా అప్పటికే అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్న కార్లు ఆయన్ను అనుసరిస్తూ ప్రదర్శనగా నెల్లూరుకు వెళ్లాయి. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏఏబీ, ఏఎంసీ చైర్మన్‌లు నిరంజన్ బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ ఎం.శ్రీనివాసులురెడ్డి, బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎం.సుప్రజ, పార్టీ మండల కన్వీనర్‌లు గంధం వెంకటశేషయ్య, ఎస్.సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.